# బాబోయ్! కంప్యూటర్ స్కూల్

యర్రంశెట్టి శాయి

మా కాలనీ వాళ్ళందరికీ హఠాత్తుగా కంప్యూటర్ ఎడ్యుకేషన్ మీద మోజు పెరిగిపోయింది.

కాలనీలో విద్యార్థులు, విద్యార్థినులు ఎవర్ని చూసినా "ఈవెనింగ్స్లో కంప్యూటర్ ఇన్స్టిట్యూట్ కెళ్తున్నానండీ! పి.జి. డిప్లొమా కోర్స్ చేస్తున్నాను" అనటం ప్రారంభించారు.

– కొంతమంది కోర్స్ పూర్తి చేసిన కుర్రాళ్ళు "ఫోర్ థౌజండ్ జీతం మీద కంప్యూటర్ ప్రోగ్రామర్గా వర్క్ చేస్తున్నాం" అని చెప్పటం కూడా మా చెవిన పడింది.

"మా అబ్బాయిని కూడా కంప్యూటర్ కోర్స్ చేయిస్తాను" అన్నాడు గోపాల్రావ్ వాళ్ళందరి గురించీ తెలుసుకుని ఎగ్జయిటయిపోతూ.

ఏ ఇన్స్టిట్యూట్లో చేర్చాలా అని అన్ని న్యూస్పేపర్లూ తెప్పించి వివరాల కోసం చూశాము.

ఎవర్ని చూసినా 'మాది అమెరికాలో గుర్తింపబడింది' అని ఒకరు "మాది జపాన్ వ్యవహారం" అని ఇంకొకరు. 'మాది ఇంటర్నేషనల్' అని మరొకరు రకరకాల డబ్బాలు కొట్టడం కనిపించింది.

"ఇలా పేపర్లు చూస్తే లాభం లేదు– మనమే స్వయంగా చూసి అప్పుడు నిర్ణయించుకుందాం" అన్నాడు రంగారెడ్డి.

అందరం బషీర్బాగ్ దగ్గర్లో వున్న ఇన్స్టిట్యూట్లోకి నడిచాము.

"ప్లీజ్ బి సీటెడ్ డైరెక్టర్గారు బిజీగా వున్నారు" అంది అందమయిన ఓ పిల్ల ఆక్స్ఫర్డ్ ఇంగ్లీష్లో!

అందరం కూర్చున్నాం.

ఓ గంట తర్వాత మాకు డైరెక్టర్ రూమ్లో కెళ్ళే అవకాశం వచ్చింది.

"కంప్యూటర్ ఇన్స్టిట్యూట్కే డైరెక్టర్. అంటే చాలా పెద్ద చదువులు చదివినవాడయి వుంటాడు. కొంచెం వినయంగా మాట్లాడాలి మనం" అన్నాడు శాయిరాం.

నలుగురం వేగంగా కొట్టుకుంటున్న గుండెలతో లోపలకు నడిచాము.

లోపల ఎ.సి. చల్లదనంలో విశాలమయిన టేబుల్ వెనుక కూర్చుని వున్నాడు డైరెక్టర్.

"కమిన్ జెంటిల్మన్– ప్లీజ్ టేక్ యువర్ సీట్" అన్నాడతను క్వీన్స్ ఇంగ్లీష్లో–

ఎందుకయినా మంచిదని మేము అందరం చేతులెత్తి "నమస్కారం సార్" అన్నాం.

"నేను మీకు ఏం సహాయం చేయగలను?" అన్నాడు అమెరికన్ తెలుగులో.

"మా వాడిని మీ ఇన్స్టిట్యూట్లో చేర్పించాలని అనుకుంటున్నాను సార్. ఏ కోర్స్లో జేరితే బావుంటుందో మీరు గైడ్ చేస్తే–" అన్నాడు గోపాల్రావ్ వినయంగా.

"పి.జి. కోర్సయితే ముప్ఫయ్, ఆరు నెలల కోర్స్ పదహారు, మూడు నెలల కోర్స్ ఎనిమిది, నెల కోర్స్ నాలుగు" అన్నాడు. మాకా అంకెలు అర్థం కాలేదు.

"ముప్ఫయ్ అంటే ఏమిటి సార్?" అడిగాడు రంగారెడ్డి ఇంకా బాగా వినయంగా.

"అదే– ముప్ఫయ్ అంటే ముప్ఫయ్ వేలు ఫీజు అని అర్థం"

ఆ మాట వింటూనే మా వెనుక ధన్ మన్న శబ్దం వినిపించింది. మేము వెనక్కు తిరిగి చూసేసరికి గోపాల్రావ్ కింద పడివున్నాడు.

"అరెరె! ఏం జరిగింది?" కంగారుగా అన్నాడు రంగారెడ్డి. మేమంతా గాబరా పడుతూ గోపాల్రావ్ చుట్టూ మూగేసరికి డైరెక్టర్ చిరునవ్వుతో మమ్మల్ని పిలిచాడు.

"డోంట్ వర్రీ! ఇది మామూలేలే! ఫీజ్ విషయం వినగానే చాలా మంది ఇలా పడిపోతూంటారు! ఆ గ్లాసులో నీళ్ళు మొఖాన్న కొట్టండి! తేరుకుంటాడు"

గ్లాసులో నీళ్ళు చిలగ్గానే లేచి కూర్చున్నాడు గోపాల్రావ్. "నేనెక్కడున్నాను?" అన్నాడు చుట్టూ చూస్తూ.

"కంప్యూటర్ ఇన్స్టిట్యూట్లో" అన్నాడు యాదగిరి.

"థూ, నీ యవ్వ కంప్యూటర్ ఇన్స్టిట్యూట్!" అనుకుంటూ తలుపు దభాలున తెరచుకుని లోపలికొచ్చాడో పెద్దమనిషి.


"ఏరా! మా అబ్బాయిని నీ ఇన్స్టిట్యూట్లో చేర్చేప్పుడు ఏం చెప్పావ్‌రా నువ్వు? ఆరు వారాల్లో క్రాష్ కోర్స్ అయిపోతుందన్నావ్! నీ మాటలు నమ్మి వాడిని సెలవుల్లో చేర్పించాను. ఆరు నెలలయింది గానీ కోర్స్ కంప్లీటవలేదు – పైగా అడిగితే నా ఇష్టం అంటావా?" అంటూ అమాంతం డైరెక్టర్ చొక్కా పట్టుకున్నాడు.

వాచ్మెన్ పరుగుతో డైరెక్టర్ని రక్షించడానికి వచ్చాడు.

"ఏయ్ ఎవడయినా దగ్గరకొచ్చాడంటే కత్తితో పొడుస్తా! నా కడుపుమంట మీకేం తెలుసురా! మా దగ్గర నాలుగువేలు కొట్టేశాడు. మా వాడు అటు భీమవరంలో కాలేజ్కి వెళ్ళలేదు. ఇటు వీడి కోర్సూ పూర్తవదు. నా డబ్బు నా కివ్వరా! లేకపోతే ఛంపేస్తా"

మేము దిగ్భ్రాంతితో చూస్తున్నాం! పాపం ఆ డైరెక్టర్ని రక్షించాలని వుంది మాకు– ఇద్దరినీ విడిపించాలని నేను రెండడుగులు వేశానో లేదో ఇంకో పెద్దమనిషి ఆయాసంతో ఒగరుస్తూ ఓ లాఠీ తీసుకొచ్చాడు లోపలకు.

"ఒరేయ్! మా పిల్లలిద్దరినీ చేర్చి ముప్ఫయి వేలు ఫీజు కట్టాన్రా నీకు! బాస్టర్డ్ ఆ ముప్ఫయ్ వేలు ఎలా తెచ్చానో తెలుసంట్రా? మాఆవిడ గొలుసమ్మి తెచ్చి నీ వెధవ ముఖాన్న పోశాన్రా! ఎందుకు చేశాన్రా ఆ పని!



నా పిల్లలిద్దరికీ పి.జి. డిప్లొమా వస్తుందని! సంవత్సరం కోర్సన్నావ్- ఇప్పటికి మూడేళ్ళయిందిరా! కంప్యూటర్లు పని చెయ్యవ్! నేర్పించడానికి అర్హత వున్న సిబ్బంది వుండరు- ఎందుకంటే వాళ్ళకి జీతాలివ్వవ్! రోజుకో ఇన్‌స్ట్రక్టర్ మారిపోతాడు. పరీక్షలు పెట్టేవాడుండడు. పెడితే దిద్దేవాడుండడు. ఎంతకాలం ఎంతమందిని మోసం చేస్తార్రా ఇలా? పైగా మీ దగ్గర నేర్చుకుంటే ఉద్యోగం గ్యారంటీ అంటూ ప్రకటనలిస్తారా? నీ బిల్డింగ్ కింద కెళ్ళి చూడరా! చెట్టు కింద నువ్విచ్చిన పి.జి. డిప్లొమా కుర్రాడు మిర్చి బజ్జీలమ్ముకుంటున్నాడ్రా ఉద్యోగం దొరక్క-"

మేమింక అక్కడ వుండలేకపోయాం. తలుపు తెరచుకుని బయటికొచ్చేసరికి అక్కడ ఇంకొంతమంది కౌన్సిలర్స్‌తో పోట్లాడుతున్నారు.

"ఇంత మోసం చేస్తారా? ఆ పక్క ఇన్‌స్టిట్యూట్‌లో ఇదే కోర్స్‌కి పదిహేను వందలు తీసుకుంటూంటే మా దగ్గర మీరు నాలుగువేలు కాజేస్తారా? మర్యాదగా మా డబ్బు మాకివ్వండి! లేకపోతే మిమ్మల్ని చంపి మేము ఛస్తాం! ఒరేయ్ మాలాంటి బీదాళ్ళను మోసం చేసి డబ్బు సంపాదిస్తే మీకు పుట్టగతులుండవురా!" అంటూ ఆవేశంగా అరుస్తున్నారు.

మేము ఆ బిల్డింగ్ బయటికొచ్చేసరికి అరడజను మంది బిచ్చగాళ్ళల్లాంటి గెటప్‌లో వున్నవాళ్ళు మా వెనుకపడ్డారు.

"సార్! కంప్యూటర్ కోర్సా సార్? మా స్కూల్లో చేరండి సార్! పి.జి. కోర్సే ఆరు వేలు సార్!"

"మా స్కూల్లో చేరండి సార్! ఇదిగో మెట్ల కిందే వుంది కంప్యూటర్! కావాలంటే చూడండి. కొత్తది - రెండువేలే సార్-'

నీవు నావాడవైన నాడు
నా మనసున వలపుల 'జడి'
నీవులేని ఈనాడు
మిగిలింది నా కన్నుల 'తడి'

—కె.ఎ.ఎల్.సత్యవతి

"మాది బెస్ట్ ఇన్‌స్టిట్యూట్ సార్! నెలకి రెండొందలిస్తే చాలు సార్- మీ పిల్లల్ని స్కూలుకి కూడా పంపనక్కర్లేదు సార్! డిప్లొమా ఇచ్చేస్తాం"

మేము అతికష్టం మీద వాళ్ళను వదిలించుకుని కాలనీకి చేరుకున్నాం-

"అంకుల్! ఎక్కడయినా వెయ్యి రూపాయలు జీతం దొరికే ఉద్యోగం ఇప్పించండంకుల్!" అంటూ నలుగురు ఉద్యోగం చేసే కుర్రాళ్ళు మా చుట్టూ మూగారు.

"అదేమిటి? మీ పి.జి. డిప్లొమా చేసిన వాళ్ళకు నాలుగువేలు జీతం ఇస్తున్నారని అన్నారుగా?"

"అది కంప్యూటర్స్ వచ్చిన కొత్తలో సంగతంకుల్! ఇప్పుడు కంప్యూటర్ ఆపరేటర్‌కి కిళ్లీ కొట్లో కుర్రాడికంటె తక్కువ జీతం ఇస్తున్నారంకుల్"

యాదగిరి కెవ్వున అరచాడు. "ఇందాకటి కెళ్ళి యాద్ జేస్కోనికి కోషిష్ జేస్తుంటి నన్నా! ఆ డైరెక్టర్ ఎవళో ఎరుకనా! సినిమా హాల్లో బ్లాక్ టికెట్లమ్మేటోడు! చాల్దినాల కిందట మన కాలనీ వాండ్లందరం సుష్మ థియేటర్ల రెగ్యులర్‌గా పోయేటోండ్లం గదా! బ్లాక్‌టికెట్లు ఈడే అమ్ముతుండె!"

అప్పుడు గుర్తుకొచ్చింది మా క్కూడా! యాదగిరి చెప్పినమాట నిజమే!

"ఛూ! మా వాడికి కంప్యూటర్ కోర్సే వద్దు" అన్నాడు గోపాలావ్.